ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

-  కమ్మని విందుల కనుమ పండుగ అందరి కుటుంబాలలో సంతోషం నింపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.
-  నంద్యాల జిల్లా బనగానపల్లెలో 30 కోట్ల రూపాయల విలువైన కాలువల నిర్మాణ పనులకు ఈరోజు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి భూమి పూజ చేశారు.
-  జాతీయ సైనిక దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.
-  తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పార్వేట ఉత్సవాన్ని ఈరోజు ఘనంగా నిర్వహించారు.
-  ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ఈనెల 19వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

===================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కమ్మని విందుల కనుమ పండుగ అందరి కుటుంబంలో సంతోషం నింపాలని ఆకాంక్షించారు. రైతుల జీవితాలతో విడదీయరాని అనుబంధం పెనవేసుకొన్న పశు సంపదను పూజించే పవిత్ర కర్తవ్యాన్ని ఈ పర్వదినం బోధిస్తుందని చెప్పారు. కాలం మారినా తరగని అనుబంధాల సంపద మనదని, ఆ విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

===================

నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలో 30 కోట్ల 66 లక్షల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కాలువ, జుర్రేరు కాలువ నిర్మాణ పనులకు ఈరోజు రహదారులు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బనగానపల్లె పట్టణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మరో రెండున్నర సంవత్సరాల తరువాత బనగానపల్లె పట్టణంలో కాలువలు కనబడకుండా భూగర్భంలో కలిసిపోయే విధంగా చేస్తామన్నారు. బనగానపల్లె పట్టణంలోని నడిబొడ్డున ఉన్న జుర్వేరువాగు ఆక్రమణలకు గురికావడంతో వాటిని తొలగించాలని అధికారులకు ఆదేశాలిచ్చామని మంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ బైట్..25 సెకన్లు)

===================

పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం నవుడూరు గ్రామంలో వినూత్నంగా సంక్రాంతి తిరునాళ్ళు ఏర్పాటు చేశారు. సంక్రాంతికి సుదూర ప్రాంతాలనుంచి వచ్చే బంధుమిత్రులు ఆనందంగా గడిపేందుకు వినూత్నంగా ఆలోచించి ఈ ఏర్పాట్లు చేశామని స్థానిక నాయకులు తెలిపారు. కనుమరుగవుతున్న పిట్టలదొర, సోది, బుడబుక్కలవాళ్ళు, హరిదాసులతో పాటు ఎడ్ల బళ్ళు, గుర్రపు స్వారీలు, రంగులరాట్నంలను ఉచితంగా ఎక్కి విహరించే విధంగా.. పిల్లలు, మహిళల కోసం మూడు

రోజులు పాటు ఈ ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుండి కూడా ఈ తిరుణాళ్లను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారు.

===================

జాతీయ సైనిక దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. 1949 జనవరి 15న ఫీల్డ్ మార్షల్ కోదండ ఎం. కరియప్ప భారత సైన్యానికి తొలి కమాండర్-ఇన్-చీఫ్ గా బాధ్యతలు స్వీకరించిన రోజును పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం ఈరోజున జాతీయ సైనిక దినోత్సవంగా జరుపుకుంటాం. బ్రిటిష్ చివరి కమాండర్-ఇన్-చీఫ్ అయిన జనరల్ సర్ ఫ్రాన్సిస్ బుచర్ తరువాత బాధ్యతలు చేపట్టిన ఎం.కరియప్ప స్వాతంత్ర్యానంతరం భారత సైన్యంలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చారు. దార్శనిక నాయకుడైన ఫీల్డ్ మార్షల్ కరియప్ప భారత సైన్యం ఆధునిక నిర్మాణానికి, నైతికతకు పునాది వేశారు. సైనిక దినోత్సవంపై మరిన్ని విషయాలను విశ్రాంత కమాండర్ రవి సుందర్ రాజన్ ఆకాశవాణితో పంచుకుంటూ...

(వాయిస్ బైట్..39 సెకన్లు)

===================

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పార్వేట ఉత్సవం, కనుమ పండుగను ఈరోజు అత్యంత ఘనంగా నిర్వహించారు. గోదాపరిణయోత్సవం సందర్భంగా ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్ద జీయ్యర్‌స్వామి మఠం నుండి ఆలయ నాలుగు మాడ వీధులలో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకువెళ్ళి స్వామివారికి సమర్పించారు. అనంతరం మలయప్ప స్వామివారు, శ్రీ కృష్ణస్వామివారు పార్వేట మండపానికి తీసుకుని వచ్చి.. అక్కడ ఆస్థానం, పార్వేట కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల కారణంగా శ్రీవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ ఈరోజు రద్దు చేసింది.

===================

విరామం

===================

మానవ తప్పిదాల వల్లనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ శాంతకుమారి అన్నారు. సవరించిన 2019 మోటార్ వాహనాల చట్టం నిబంధనలు కఠినంగా ఉన్నాయని ప్రతి ఒక్కరూ చట్టాల పరిధి లోబడి ప్రవర్తించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపినా, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనం నడిపినా, వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉందన్నారు. మరీ ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు లేదా వాహన యజమానులు కూడా శిక్షకు అర్హులని అన్నారు. సవరించిన మోటార్ వాహనాల చట్ట ప్రకారము వాహనం కొన్న చోటనే సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఈ చట్టం అవకాశం కల్పించిందన్నారు. ఈ చట్టాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు రోడ్ సేఫ్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు.

===================

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జగ్గన్నతోట ప్రభలతీర్థంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కనుమ పండుగను పురస్కరించుకుని ఈ రోజు జిల్లాలోని అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో నిర్వహించే జగ్గనతోట ప్రభల తీర్థానికి కుటుంబ సమేతంగా వేలాదిమంది భక్తులు తరలివచ్చి ఏకాదశి రుద్రులను దర్శించుకుని తీర్థాన్ని తిలకించారు. ఎంతో

ప్రాముఖ్యత ఉన్న ఈ ప్రభల ఉత్సవానికి 400 సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉంది. ఇటీవల భారత పర్యాటక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఉత్సవ్ విభాగంలో ఈవెంట్ అండ్ ఫెస్టివల్ విభాగంలోని జాబితాలో జగన్నతోట ప్రభల ఉత్సవం చోటు దక్కించుకుంది. ప్రతి సంవత్సరం సంక్రాంతికి ఈ ప్రభల ఉత్సవాలను తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుండే కాకుండా దేశ విదేశాల నుండి సైతం తరలివస్తుంటారు. దీనికి సంబంధించి మరింత సమాచారం మా ఆకాశవాణి కోనసీమ జిల్లా ప్రతినిధి కె ఎస్ ఎన్ మూర్తి అందిస్తారు.

(వాయిస్ బైట్..32 సెకన్లు)

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 118వ సంచిక ఈనెల 19వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 17వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

===================

విశాఖపట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానంలో ఈరోజు కనుమ పండుగ సందర్భంగా శ్రీ అప్పన్న గోశాలలో గోపూజను వైభవంగా నిర్వహించారు. గోమాతను పూజించడం ఋషులకాలం నుంచి సంప్రదాయంగా వస్తోంది. గోవు సమస్త దేవతాస్వరూపమని, గోవుల యందు సకల దేవతలు, తీర్థాలు కొలువై ఉంటాయని భక్తుల విశ్వాసం.

===================

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈరోజు కైలాసగిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. కనుమ పండుగ సందర్భంగా ఆలయంలో ఈరోజు గోపూజ నిర్వహించారు. అనంతరం ఆలయంలోని అలంకార మండపం నుంచి శ్రీ సోమస్కంద మూర్తి సమేత జ్ఞాన ప్రసూనాంబికా దేవి అమ్మవారికి... కైలాసగిరి ప్రదక్షిణ నిర్వహించారు.

===================
===================